సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 12 ఏప్రిల్ । 2024



## లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు

నబ్బవరం: దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరదేవి ఆరాధన పీఠంలో లలితాంబిక శ్రీ శారదా పరమేశ్వరిగా దర్శనమిచ్చారు.



## సిరులతల్లికి పంచామృతాభిషేకం

విశాఖ: కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. 36మంది ఉభయదాతలు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
36.8/24.5

## వాతావరణం

వేడి, తేమతో అసౌకర్యమైన వాతావరణం ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.



గొలుగొండ: ఏఎల్‌పురంలో రంజాన్ విశిష్టత గురించి వివరిస్తున్న ముస్లిం మత పెద్ద



యలమంచిలి: జామియా మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు,



మునగపాక: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

# ఆనందోత్సాహాలతో రంజాన్ వేడుక

రంజాన్ పండగను ముస్లింలు జిల్లా అంతటా భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కశింకోట ఈద్‌ఘాహ్ వద్ద గురువారం సంప్రదాయ వస్త్రాలు ధరించి సామూహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇమామ్ బోధనలు చేశారు. అనంతరం ముస్లిం పెద్దలు, పిల్లలు ఒకరికొకరు సంప్రదాయంగా రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందువులు కూడా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రోలుగుంట మండలం నిండుగొండ, రోలుగుంట మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. బంధువులను, స్నేహితులను తమ ఇళ్లకు విందు భోజనానికి ఆహ్వానించి ఆనందంగా గడిపారు. మాడుగుల, దేవరాపల్లిలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. మానవాళి హితాన్ని ఆకాంక్షించే పవిత్ర రంజాన్ పర్వదిన గొప్పతనాన్ని ముస్లిం మత పెద్దలు వివరించారు. మునగపాక, మాకవరపాలెం, గొలుగొండ మండలంలో చీడిగుమ్మల, ఏఎల్‌పురం గ్రామాల్లో రంజాన్ సందడి కనిపించింది. యలమంచిలి జామియా మసీదులో రెహమత్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా రంజాన్ వేడుకలు జరిగాయి. -సాక్షి న్యూస్ నెట్‌వర్క్

## న్యూస్‌రీల్

### పూలే స్ఫూర్తితో అసమానతలు రూపుమాపుదాం

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: మహాత్మ జ్యోతిరావు పూలే ఆదర్శాలను ఆచరిస్తూ సమాజంలో మిగిలి ఉన్న అసమానతలు రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 198వ జయంత్యుత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వందేళ్ల క్రితమే సమాజం ప్రగతి పథంలో పయనించాలంటే బాలికలకు విద్య అవసరమని గుర్తించి, వారికి ప్రత్యేక పాఠశాల ప్రారంభించారన్నారు. అట్టడుగు వర్గాల వారిలో చైతన్యం తీసుకువచ్చి సమాన హక్కుల కోసం పోరాడారన్నారు. వారి అడుగుజాడల్లో మనమంతా నడవాలన్నారు. వర్ణ, లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేశారన్నారు. ఆ మహనీయుని కృషి మూలంగానే ఈనాడు బాలికలు చదువుకుని పురుషులతో సమాన హక్కులు పొందుతున్నారన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టాయని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కే రాజేశ్వరి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

### టాటా - ఎర్నాకుళం రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో లిమిటెడ్ హైట్ సబ్‌వే నిర్మాణం నిమిత్తం ట్రాఫిక్ కం పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున ఈ నెల 13వ తేదీన టాటానగర్‌లో ఉదయం 5.15గంటలకు బయల్దేరవలసిన టాటానగర్– ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ సుమారు 4గంటలు ఆలస్యంగా ఉదయం 9.15గంటలకు బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.


### అమెరికా ఎఫ్‌ఎల్‌ఎల్ పోటీలకు 'వారిజ' విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కొమ్మాది : ఫస్ట్ లెగో లీగ్ (ఎఫ్‌ఎల్‌ఎల్) రోబోటిక్స్ పోటీలు ఈ నెల 17 నుంచి 20 వరకు అమెరికాలో గల హోస్టన్‌లో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు భీమిలి బీచ్ రోడ్డు వారిజ నేత్ర విద్యాలయంలో విద్య అభ్యసిస్తున్న ఆరుగురు అంధ విద్యార్థులు ఎంపికైనట్లు విద్యాలయ నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన, ధనలక్ష్మి, రవి, గాయత్రి, సుప్రియ, సంజయ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇటీవల గోవాలో జరిగిన ఎఫ్‌ఎల్‌ఎల్ రోబోటిక్స్ పోటీల్లో 5 దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా ఇక్కడి నేత్ర విద్యాలయంలో విద్య అభ్యసిస్తున్న అంధ విద్యార్థులు పాల్గొని టీమ్ చాంపియన్‌షిప్ సాధించినట్లు తెలిపారు. ఈ పోటీలు అనంతరం 28న అమెరికా నుంచి బయలుదేరి వారిజా ఆశ్రమానికి చేరనున్నట్లు నేత్ర విద్యాలయ ప్రెసిడెంట్ పీఎస్ఎన్ రాజు తెలిపారు.

### వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

# బుచ్చెయ్యపేటలో టీడీపీ, జనసేనకు షాక్



ప్రభుత్వ విప్ ధర్మశ్రీ సమక్షంలో చేరిన బుచ్చెయ్యపేట టీడీపీ, జనసేన నాయకులు

- ఆ పార్టీల నుంచి 100 మంది నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరిక

బుచ్చెయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన పట్ల ఆకర్షితులై టీడీపీ, జనసేన పార్టీల నాయకులు వైఎస్సార్‌సీపీకి క్యూ కడుతున్నారు. తాజాగా బుచ్చెయ్యపేటకు చెందిన వంద మంది ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వార్డు మాజీ మెంబర్ సూరిశెట్టి భూషణం, నాయకులు, కార్యకర్తలు సూరిశెట్టి చిన్న, ఐయితరెడ్డి ఈశ్వరరావు, చిలుకు, సుంకరి లోవ, కొల్లి అప్పారావు తదితరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి చేరగా, వీరందరికీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. తెలుగుదేశం, జనసేన పార్టీల విధి విధానాలు నచ్చక తామంతా చేరామని, ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని రెండో సారి గెలిపించేందుకు తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పార్టీలో చేరినవారు తెలిపారు. చంద్రబాబునాయుడు గతంలో రైతు, డ్వాక్రా రుణమాఫీ చేస్తామని, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అని చెప్పి మోసం చేశారని దుయ్యబట్టారు.

# 20న జిల్లాలో సీఎం జగన్ బస్సుయాత్ర

- పాయకరావుపేట నుంచి ప్రారంభం
- చోడవరంలో 'మేమంతా సిద్ధం' సభ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ వెల్లడి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన బస్సు యాత్ర ఈ నెల 20న అనకాపల్లి జిల్లాలో ప్రవేశిస్తుందని, పాయకరావుపేట నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. జిల్లాలో జరిగే బస్సు యాత్ర షెడ్యూల్‌ను ఆయన వివరించారు. గురువారం ఆయన పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ రాత్రికి సీఎం జగన్ కాకినాడ జిల్లా తుని చేరుకుంటారన్నారు. 20వ తేదీ ఉదయం పాయకరావుపేట నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి, అడ్డురోడ్డు జంక్షన్లలో రోడ్‌షో జరుగుతుందన్నారు. అడ్డురోడ్డు నుంచి జాతీయ రహదారి మీదుగా యలమంచిలి పట్టణంలోకి బస్సుయాత్ర ప్రవేశిస్తుందని ఆయన తెలిపారు. కాంప్లెక్స్ కూడలి నుంచి జాతీయ రహదారి మీదుగా బస్సు యాత్ర తాళ్లపాలెం చేరుకుంటుందన్నారు. తరువాత అనకాపల్లి నాలుగు రోడ్ల కూడలి నుంచి వెంకన్నపాలెం మీదుగా చోడవరం వరకు యాత్ర సాగుతుందన్నారు. అక్కడ మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న మేము సిద్ధం బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం బస్సుయాత్ర సబ్బవరం చేరుకుంటుందని, అక్కడే రాత్రి బస చేస్తారన్నారు. 20న అనకాపల్లి జిల్లాలోకి ప్రవేశించే జగన్ బస్సుయాత్రకు నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి ఘన స్వాగతం పలకాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, మాజీ మండల శాఖ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, వార్డు సభ్యులు దనిశెట్టి బాబీ, ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యుడు కాదా రామకృష్ణ పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులకు అండగా వైఎస్సార్‌సీపీ

- నాడు వైఎస్సార్‌తో.. నేడు ఆయన తనయుడితో మేలు
- ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో బూడి ముత్యాలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు

అనకాపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులకు అండగా నిలిచారని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన ఏడాదిలోపే ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడమే కాదు నిధులు కూడా మంజూరు చేశారన్నారు. ఇక్కడి వైఎంవీఏ హాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా వ్యాపార విభాగం అధ్యక్షుడు తడిమిశెట్టి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను అనకాపల్లిలో మున్సిపల్ హైస్కూల్లో చదువుకున్నానని, ఇక్కడి ఆర్యవైశ్యులతో తనకు చిన్ననాటి నుంచే పరిచయం ఉందని తెలిపారు. 1500 జనాభా ఉన్న చిన్న గ్రామంలో జన్మించి వార్డు స్థాయి నుంచి డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగానని, కింది స్థాయి నుంచి వచ్చిన తనకు సమస్యలేమిటో తెలుసన్నారు. ఆర్యవైశ్యులకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టం కట్టనున్నారన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సమాజ హితులని, మంచి కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు మేలు జరగాలని ఆ కాంక్షిస్తారన్నారు. వారికి పార్టీ అండగా ఉంటుంద ని, రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడును, అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, పార్టీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహ, ఆర్యవైశ్యులు డాక్టర్ శేషుకుమార్, రాజు, సతీష్, గుప్త, పొట్టి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# రామానాయుడు కంటతడి



విలపిస్తున్న గవిరెడ్డి రామానాయుడును ఓదారుస్తున్న సహచరులు


- టీడీపీని బతికించాను.. అధిష్టానం గుర్తించలేదని ఆవేదన
- సముదాయించిన కార్యకర్తలు

మాడుగుల, చీడికాడ: మాడుగుల టీడీపీ అభ్యర్థి విషయంలో మార్పు ఏమీ లేదని ఒకపక్క చీడికాడ సమావేశంలో సీఎం రమేష్ సోదరుడు ప్రకటించగా.. మాడుగుల మండలం జంపెన గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మరోపక్క గవిరెడ్డి రామానాయుడు తనకు అన్యాయం జరిగిందని కంటతడి పెట్టారు. కష్టకాలంలో పార్టీని బతికించానని, అయినా అధిష్టానం గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2009లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, 2014, 19 ఎన్నికల్లో ఓటమి చెందినా ఏనాడూ పార్టీని వదల్లేదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పార్టీ అప్పగించిన ప్రతి పని విజయవంతం చేశానన్నారు. 15 ఏళ్లుగా కుటుంబాన్ని వదిలి పార్టీ కోసం పనిచేశానని, చంద్రబాబు, లోకేష్, పాదయాత్రలను జయప్రదం చేశానని చెప్పారు. వ్యాపారాలు మానుకుని సొంత నిధులతో పార్టీని నిలబెట్టానన్నారు. తనపై తప్పుడు ప్రచారం చేసి, లోకేష్‌ను మంచి చేసుకొని టికెట్ తెచ్చుకున్న పైలా.. నియోజకవర్గ ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికలు అయిపోయాక అమెరికా వెళ్లిపోయే వ్యక్తికి పార్టీ టికెట్ ప్రకటించడం దారుణమన్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ రామానాయుడు కంటతడి పెట్టడం సహచరులను కదిలించింది. ఒక దశలో బోరున విలపించడంతో పార్టీ నాయకులు ఆయనను సముదాయించారు. పార్టీ బీ ఫారం ఇచ్చేవరకు నియోజకవర్గంలో తిరుగుతూ పోరాడుతానని, టికెట్ ప్రకటించకపోతే నియోజకవర్గ నాయకులు, ప్రజల సలహా మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. చీడికాడలో పైలా ప్రసాదరావు నిర్వహించిన సమావేశానికి రామానాయుడితోపాటు పీవీజీ కుమార్ గైర్హాజరయ్యారు.


# రెప్పపాటు నిర్లక్ష్యం

- టిప్పర్ లారీ చక్రాల కింద నలిగిన ప్రాణాలు
- మృతుల్లో ఇద్దరు బాలురు, ఒక మహిళ
- ఎదురుగా వస్తున్న వ్యక్తిని తప్పించబోయిన బైక్
- దాన్ని గమనించక ఢీకొట్టిన టిప్పర్ లారీ డ్రైవర్
- అచ్యుతాపురం కూడలి సమీపంలో ఘటన
- మూడు కుటుంబాలకు తీరని శోకం

అతివేగం.. ఆపై నిర్లక్ష్యం బైక్‌పై వెళ్తున్న ఇద్దరు బాలురు, ఓ మహిళ ప్రాణాలు క్షణకాలంలో గాలిలో కలిసిపోయాయి. ఎదురుగా నడుచుకుంటూ వస్తున్న వ్యక్తి.. పక్కన పార్కింగ్ చేసిన కార్లు.. వెరసి తప్పించుకునే అవకాశం లేక టిప్పర్ లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో దాని చక్రాల కింద నలిగిపోయారు. ఈ ఘటన చూసిన వారిని ఒక్కసారిగా షాక్‌కు గురి చేసింది.



మృతుడు ప్రకాశ్(ఫైల్)



మృతుడు శేఖర్(ఫైల్)

అచ్యుతాపురం: రెప్పపాటు నిర్లక్ష్యం మూడు నిండు ప్రాణాలను బలిగొంది. నిత్యం రద్దీగా ఉండే అచ్యుతాపురం కూడలికి కూత వేటు దూరంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు టిప్పర్ లారీ చక్రాల కింద నలిగి మాంసపు ముద్దలయ్యారు. ఈ హృదయ విదారక సంఘటన గురువారం మధ్యాహ్నం 11 గంటలకు చోటు చేసుకుంది. దీంతో ఇటు అచ్యుతాపురం, అటు దుప్పుతూరు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానిక సీఐ బుచ్చిరాజు, ప్రత్యక్ష సాక్షులు, సీసీ ఫుటేజ్ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అచ్యుతాపురం మండలంలో దుప్పుతూరుకు చెందిన గొల్లపల్లి శేఖర్ (17), జంగుళూరు జంక్షన్‌కు చెందిన దూది జ్యోతి ప్రకాష్(14) అచ్యుతాపురం సినిమాహాల్ జంక్షన్‌కు సమీపంలోని జ్యూస్ షాపు వద్దకు వెళ్లారు. అదే సమయంలో షాపు నిర్వాహకురాలు నర్మాల అమల(38) తనను యలమంచిలి మార్గంలో సాయిబాబా గుడి వద్ద దించాలని కోరింది. దీంతో అచ్యుతాపురం జంక్షన్ దాటి యలమంచిలి మార్గంలో ముగ్గురూ బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో అక్కడ రహదారికి ఎడమ వైపు మూడు కార్లు పార్కింగ్ చేసి ఉండటం, ఎదురుగా నడుచుకుంటూ వ్యక్తి రావడంతో అతన్ని తప్పించి టిప్పర్ లారీని దాటి ముందుకెళ్లే ప్రయత్నంలో దుర్మరణం పాలయ్యారు. అకస్మాత్తుగా టిప్పర్ లారీ ముందుకు బైక్ రావడంతో గమనించని డ్రైవరు ముందుకు వెళ్లిపోవడంతో వారు ముగ్గురు చక్రాల కింద నలిగి మాంసపు ముద్దలయ్యారు. చుట్టపక్కల వారు వచ్చి రక్షించేందుకు ప్రయత్నించినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.

### దుప్పుతూరువాసుల ఆగ్రహం...

ఈ రోడ్డు ప్రమాదం గురించి తెలుసుకున్న దుప్పుతూరు వాసులు లారీని రోడ్డుపై నిలిపివేశారు. అక్కడే టెంట్లు వేసి బైఠాయించారు. న్యాయం చేయాలంటూ నినదించారు. సాయంత్రం వరకూ మృతదేహాలను అక్కడే ఉంచి నినాదాలు చేశారు. అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

### అనాథగా చిన్నారులు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నర్మాల అమల(38)కు భర్త లేరు. తన ఇద్దరు ఆడపిల్లల పోషణ కోసం పాన్‌షాప్ నడుపుతోంది. సాయిబాబా దర్శనం కోసం వెళ్లిన ఆమె అనంతలోకాలకు వెళ్లిపోవడంతో ఇద్దరు బాలికల భవితవ్యం అంధకారంగా మారింది. తండ్రి లేని లోటు తెలియకుండా పెంచుతున్న తల్లి సైతం మృతి చెందడంతో కుమార్తెలు రోదిస్తున్న తీరు చూసి అక్కడి వారు చలించిపోయారు.





టిప్పర్ లారీ చక్రాల కింద నలిగిపోయిన మృతులు

### రెండు కుటుంబాల్లోనూ ఏకైక కుమారులే..

బైక్ నడిపిన గొల్లపల్లి శేఖర్ స్థానిక ఐటీఐలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి రైతు శంకర్‌రావు, తల్లి నాగలక్ష్మిల ఏకైక కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి చెల్లెలు ఉంది. కశింకోట మండలం ఉగ్గినపాలేనికి చెందిన జ్యోతి ప్రకాష్ తండ్రి సోమరాజు దుప్పుతూరు వద్ద లేఅవుట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అక్కడ జంగుళూరు జంక్షన్‌లో అద్దె భవనంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఏడో తరగతి చదువుతున్న ప్రకాష్ మృతితో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతునికి అమ్మ రామలక్ష్మి, చెల్లి జ్ఞానేశ్వరి ఉంది.



మృతదేహాల వద్ద టెంట్ వేసి లారీని నిలిపివేసిన దృశ్యం

## క్లుప్తంగా

### గుమ్మడిగొండలో 1,800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

• మాధవనగరంలో సారా విక్రేత అరెస్టు



బెల్లం పులుపుతో నాతవరం ఎస్‌ఐ రామారావు, సిబ్బంది

నాతవరం: వేర్వేరు ప్రాంతాల్లో సారా విక్రేతను అరెస్టుతోపాటు 1,800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని ఎస్‌ఐ రామారావు గురువారం తెలిపారు. మండలంలో మాధవనగరం గ్రామానికి చెందిన కట్టా అచ్చియ్యమ్మ ఇంటి వద్దే సారా విక్రయిస్తుండగా పట్టుబడిందన్నారు. ఆమె నుంచి 15 లీటర్ల సారా స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. గుమ్మడిగొండ సమీపంలో తాండవ నదీ ఒడ్డున సారా బట్టీలపై దాడులు నిర్వహించామన్నారు. తయారుదారులు పరారీ కాగా, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

### బంగారం షాపు యజమానికి యువతి టోకరా!

నర్సీపట్నం : ఓ యువతి బంగారం షాపు యజమానికి టోకరా ఇచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక వర్తకులు తెలిపిన మేరకు వివరాలివి. ఈ నెల 10న ఓ యువతి వృద్ధుడు, వృద్ధురాలిని వెంట పెట్టుకొని పట్టణంలోని ఓ బంగారం షాపునకు వెళ్లి 40 గ్రాముల బంగారంపై రూ.లక్షా 60 వేలు అప్పు కావాలని అడిగింది. షాపు యజమాని బంగారం గొలుసును గీటు పెట్టి స్వచ్ఛమైన బంగారంగా నిర్ధారించుకుని ఆమెకు రూ.లక్షా 60 వేలు ఇచ్చేశాడు. షాపు యజమానిని మాటల్లో పెట్టిన ఆ యువతి టేబుల్‌పై ఉన్న బంగారు గొలుసు స్థానంలో రోల్డ్ గోల్డ్ గొలుసు పెట్టేసి అక్కడి నుంచి ఉడాయించింది. తరువాత మరోసారి షాపు యజమాని ఆ గొలుసును గీటు పెట్టి చూస్తే అది రోల్డ్ గోల్డ్‌గా తేలడంతో కంగుతిన్నాడు. షాపులో సీసీ పుటేజ్‌ల ఆధారంగా పరిశీలించడంతో యువతి చేసిన మోసం అర్థమైంది. దీంతో షాపు యజమాని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించినట్టు తెలిసింది..



కోటవురట్ల : కోలాటం ఆడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు



నర్సీపట్నం : ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గణేష్



చీడికాడ : ఎన్నికల ప్రచారంలో అనురాధ



అనకాపల్లి : గవరపాలెంలో మలసాల ఎన్నికల ప్రచారం

# ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ

కోటవురట్ల : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వారికి ఎన్నో సంక్షేమ పథకాలను అందించారని పాయకరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని రామచంద్రపాలెం, సన్యాసిరాజుపాలెం, బి.కె.పల్లి, జల్లూరు గ్రామాలలో ఆయన గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు హారతులు పట్టారు.

నర్సీపట్నం : మున్సిపాలిటీలోని 3,4,6,7 వార్డుల్లో చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ఆయా వార్డుల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. రెట్టించిన ఉత్సాహంతో ఎమ్మెల్యే మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడుతో కలిసి ఇంటింటికీ తిరిగారు.

మాడుగుల / చీడికాడ : మండలంలోని కె.జె.పురం, చీడికాడలో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు పలకాలని కోరారు.

అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ గురువారం 80వ వార్డు గవరపాలెం చిన్న రామస్వామి ఆలయం, వేలం వీధిలో కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో, అనకాపల్లి మండలం బవులవాడలో గ్రామ సర్పంచ్ మజ్జి లక్ష్మీవెంకట అప్పారావు ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# ఐదేళ్లలో ప్రగతి పరవళ్లు



సమావేశంలో పాల్గొన్న చోడవరం నియోజకవర్గం నుంచి రాజమండ్రి ప్రాంతానికి వెళ్లిన వలస కూలీలు



రాజమండ్రిలో వలస కూలీల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ. చిత్రంలో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

• చోడవరం నియోజకవర్గంలో రూ.3వేల కోట్ల సంక్షేమాభివృద్ధి
• వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ
• రాజమండ్రిలో వలస కూలీలతో ఆత్మీయ సమావేశం

చోడవరం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో అభివృద్ధిని పరుగులు పెట్టించామని ఆ పార్టీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల నుంచి వరి కోతలు, ఇతర పనులపై రాజమండ్రి ప్రాంతానికి వలస వెళ్లిన కూలీల కుటుంబాలతో రాజమండ్రిలో గురువారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు కూడా పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని గ్రామాలను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. గత టీడీపీ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ ఐదేళ్లలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించామన్నారు. పారిశ్రామికీకరణలో భాగంగా ఇప్పటికే కోమళ్లపూడి, వెంకన్నపాలెం, అడ్డూరు, దుద్దుపాలెం ప్రాంతాల్లో భూసేకరణ కూడా చేశామన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో ప్రధాన రహదారితో పాటు అన్ని గ్రామాలకు కొత్తగా రోడ్లు నిర్మించామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని బలపరిచి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ధర్మశ్రీ కోరారు. ఈ సమావేశంలో బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన బీజేపీ, టీడీపీ నాయకులకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ సత్యవతి

• సాదరంగా ఆహ్వానించిన మలసాల భరత్ కుమార్
• చేరిన వారిలో బీజేపీ, టీడీపీ రాష్ట్ర నాయకులు

అనకాపల్లి : తుమ్మపాల గ్రామంలో బీజేపీ, టీడీపీకి చెందిన 50 కుటుంబాలు రాష్ట్ర నాయకులు బుధవారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొలపర్తి శ్రీను, బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి అలమండ శ్రీను, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీలగిరి వరహాలు, ఏడిద మహేష్, పీజే నూకరాజు, టీడీపీ రాష్ట్ర నాయకులు కొణతాల శ్రీను, చదరం నూకరాజు, పీలా శ్రీనుతో పాటు మరికొంతమందికి పార్టీ కండువాను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ సత్యవతి వేసి ఆహ్వానించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొలపర్తి శ్రీను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి వైఎస్సార్‌సీపీలోకి చేరినట్టు ఆయన చెప్పారు. సుమారుగా 15 సంవత్సరాలుగా బీజేపీలో ఉన్నానని, వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చేసి పార్టీలోకి చేరినట్టు వారు చెప్పారు.

**పార్టీ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గ్రామాల్లో గడప గడపకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా తీసుకువెళ్లి, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి ఎంపీ, పార్లమెంట్ పరిశీలకురాలు బి.వి.సత్యవతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుని ఉత్తరాంధ్ర, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రైతు సంఘం మండలపార్టీ అధ్యక్షుడు పీలా బుజ్జి ఆధ్వర్యంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి శేఖర్, అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పీడీ గాంధీ, పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు చదరం చిన్న, ఎంపీటీసీలు పంచదారల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వడ్డాది అశోక్ భారతి, పాల సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీను, పార్టీ నాయకులు పడాల గణపతి, ఏరుబండి సత్యనారాయణ, బుదిరెడ్డి దేవుడి బాబు పాల్గొన్నారు.

## 18 మంది గ్రామ వలంటీర్ల రాజీనామా



ఎంపీడీవో స్వప్నకు రాజీనామా పత్రాలను అందిస్తున్న గ్రామ వలంటీర్లు

పాయకరావుపేట : పాయకరావుపేట గ్రామంలో గల మూడవ సచివాలయానికి చెందిన 18 మంది గ్రామ వలంటీర్లు స్వచ్ఛందంగా గురువారం రాజీనామా చేశారు. వారి రాజీనామాలు విడివిడిగా రాసి ఎంపీడీవో కె.స్వప్నకు మండల పరిషత్ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తూ ఎంతో సంతృప్తి చెందేవారమని, ఎన్నికల పేరుతో తమను దూరం పెట్టడం, విమర్శించడం బాధించిందన్నారు. రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేసి, మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలన్నదే తమ అభిమతమన్నారు.

## పురుగు మందు తాగి గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

యలమంచిలి రూరల్ : పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు తుని రైల్వే పోలీస్‌స్టేషన్ ఇంచార్జ్ ఎస్‌ఐ బి.లోవరాజు మీడియాకు తెలిపారు. ఈ నెల 7వ తేదీ ఉదయం సుమారు 35 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి యలమంచిలి రైల్వేస్టేషన్‌లో పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని అంబులెన్సులో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని చిరునామా గానీ ఇతర వివరాలు గానీ తెలియలేదని, బూడిద రంగు ఫ్యాంటు, బూడిద రంగు చొక్కా ధరించి ఉన్నట్టు ఆయన తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, మృతుని కుటుంబీకులు గానీ బంధువులు గానీ తమను 9494887786, 9154627458 నంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## 1,600 లీటర్ల పులుపు ధ్వంసం

రావికమతం : గొంప గ్రామంలో బుధ, గురువారాల్లో దాడులు చేసి 1,600 లీటర్ల పులుపును ధ్వంసం చేసి, పెద్ద ఎత్తున పరికరాలను దగ్ధం చేశామని రావికమతం ఎస్‌ఐ ధనంజయ్ గురువారం తెలిపారు. ఆ గ్రామంలో సారా తయారీ చేస్తున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో సహా బుధవారం దాడి చేసి గ్రామ శివారు తోటల్లో సారా తయారీకి నిల్వ చేసిన 900 లీటర్ల పులుపును ధ్వంసం చేశామని, అలాగే గురువారం సైతం మరొక వైపు దాడులు చేసి మరొక 700 లీటర్ల పులుపును, వంట సామాగ్రిని దగ్ధం చేశామని ఎస్‌ఐ ధనంజయ్ వివరించారు.

## 276 కిలోల గంజాయి పట్టివేత

• నలుగురు అరెస్టు
• ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం
• ఆటో, బైక్ సీజ్

నర్సీపట్నం : గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేయగా మరో ముగ్గురు పరారయ్యారని రూరల్ సీఐ హరి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ వివరాలు వివరించారు. ముందస్తు సమాచారం మేరకు రూరల్ ఎస్‌ఐ భీమరాజు సిబ్బందితో నెల్లిమెట్ట మట్టిరోడ్డులో మాటు వేయగా ఆటోలో గంజాయి తీసుకువస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను గమనించి ఆటో దిగి పారిపోతుండగా పట్టుకున్నారు. ఆటోకు పైలెట్‌గా వ్యవహరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆటోలో లభించిన 276 కిలోల గంజాయిని స్వాదీనం చేసుకుని ఆటోను, బైక్‌ను, నిందితుల వద్ద ఏడు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. నిందితులు బి.కె.రాముడు, తునికి చెందిన ఎ.బాబ్జీ, ఎ.శ్రీను, ఆర్.నరసింహమూర్తిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారు ఇచ్చిన సమాచారంతో పరారైన ముగ్గురు వ్యక్తుల కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

**15కేజీల గంజాయితో ఇద్దరి అరెస్టు**

రావికమతం : బైక్‌పై తరలిస్తున్న 15 కేజీల గంజాయిని పట్టుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు గురువారం తెలిపారు. వివరాలివి. రావికమతం ఎస్‌ఐ ధనంజయనాయుడు, సిబ్బందితో కలిసి రావికమతం బస్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నంద్యాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై 15 కేజీల గంజాయితో వెళ్తూ పట్టుబడ్డారన్నారు. వీరు ఒడిశా సరిహద్దులో గంజాయిని కొనుగోలు చేసి నంద్యాలకు తరలిస్తున్నారన్నారు. దీంతో ఇద్దరినీ అరెస్ట్ చేసి గంజాయితో పాటు బైక్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

## బైక్‌ను ఢీకొట్టిన స్కూటీ

• ముగ్గురికి గాయాలు





గాయపడిన యువకులు

యలమంచిలి రూరల్ : రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు గాయపడిన ఘటన యలమంచిలి మండలం పోతురెడ్డిపాలెం వద్ద గురువారం రాత్రి జరిగింది. పోతురెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఇత్తంశెట్టి అప్పలనాయుడు గ్రామం సమీపంలో హైవే కూడలి వద్ద బైక్‌తో రోడ్డు దాటుతున్న సమయంలో తుని నుంచి యలమంచిలి వైపు వెళుతున్న స్కూటీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశాఖ నగరానికి చెందిన యువకులు వై. ప్రవీణ్, పి.చైతన్య, పోతురెడ్డిపాలెం గ్రామానికి చెందిన అప్పలనాయుడు గాయపడ్డారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే హైవే నిర్వహణ సంస్థకు చెందిన 1033 అంబులెన్సు సిబ్బంది ప్రమాద స్థలానికి వెళ్లి గాయపడిన ముగ్గుర్నీ యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ రవిచంద్ర క్షతగాత్రులకు చికిత్స అందజేశారు.

## రుషికొండ బీచ్‌లో యువకుడు గల్లంతు



గల్లంతైన తేజ

కొమ్మాది: స్నేహితులతో సరదాగా గడిపేందుకు రుషికొండ బీచ్‌కు వచ్చిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌కు చెందిన తేజ (20) గురువారం సాయంత్రం తన(ఇంటర్) స్నేహితులు జి.స్వజన్, జి.హర్ష, వంశీ, సాయి వెంకట్, ప్రణీత్‌లుతో కలసి రుషికొండ బీచ్‌కు వచ్చాడు. బీచ్‌లో సుమారు మూడు గంటలు పాటు సరదాగా గడిపి ఫొటోలు తీసుకున్నారు. అనంతరం రాత్రి 7 గంటల సమయంలో ఈ ఆరుగురు స్నేహితులు రుషికొండ బీచ్‌కు కాస్త దూరం వెళ్లి స్నానాలకు దిగారు. ఈ క్రమంలో పెద్ద కెరటం ఒక్కసారిగా రావడంతో తేజ సముద్రంలోకి కొట్టుకు పోయాడు. స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించి, పెద్దగా కేకలు వేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ సంఘటనా స్థలానికి చేరుకుని గాలించినప్పటికీ తేజ ఆచూకీ లభ్యం కాలేదు. తేజ అమరావతి విట్స్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం ఈసీఈ అభ్యసిస్తున్నాడు. తండ్రి కేఎల్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. సంఘటనా స్థలానికి ఆరిలోవ సీఐ గోవిందరావు చేరుకుని బ్లూకోర్టు పోలీసులతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**ముందే హెచ్చరించిన పోలీసులు**

ఆరుగురు స్నేహితులు రుషికొండ బీచ్‌లో స్నానాలు చేసేందుకు సముద్రంలో దిగుతుండగా చీకటి కావడంతో వెనక్కి రావాలంటూ పోలీసులు హెచ్చరించారు. దీంతో వీరు కాస్త దూరంగా వెళ్లి సముద్రంలో స్నానాలు చేయడంతో ప్రమాదం ముంచుకొచ్చింది. వీరు వెళ్లిన తీర ప్రాంతం ప్రమాదకర ప్రాంతం కావడంతో తేజ గల్లంతు అయ్యాడని లైఫ్‌గార్డ్స్ తెలిపారు. పోలీసులు తేజ తల్లిదండ్రులకు సమాచారం అందజేసి కేసు నమోదు చేశారు.

## ప్రయాణికుల కోసం స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

➡ సూరత్ – బ్రహ్మపూర్ (09069) స్పెషల్ సూరత్‌లో ఈ నెల 17, 24, మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26న (బుధవారాల్లో) మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 8.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.12 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 1.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్‌లో ఈ నెల 19, 26, మే 3, 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28న (శుక్రవారాల్లో) తెల్లవారుజామున 3.30 గంటలకు బయల్దేరి ఉదయం 8.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.22 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.45 గంటలకు సూరత్ చేరుకుంటుంది.

➡ నాగర్ కోయల్ – డిబ్రూగడ్ (06103) సూపర్‌ఫాస్ట్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12, 26, మే 10, 24న (శుక్రవారాల్లో) నాగర్‌కోయల్‌లో సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 11.20 గంటలకు బయల్దేరి సోమవారం రాత్రి 8.50 గంటలకు డిబ్రూఘడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో డిబ్రూఘడ్ ➡ నాగర్‌కోయల్ (06104) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ డిబ్రూగడ్‌లో ఈ నెల 17, మే 1, 15, 29న (బుధవారాల్లో) రాత్రి 7.55 గంటలకు బయల్దేరి మూడో రోజు సాయంత్రం 4.28 గంటలకు దువ్వాడ చేరకుంటుంది. అక్కడి నుంచి 4.30 గంటలకు బయల్దేరి శనివారం రాత్రి 9.30 గంటలకు నాగర్‌కోయల్ చేరుకుంటుంది.

➡ ఎస్ఎంవీ బెంగళూరు–ఖరగ్‌పూర్ (06507) స్పెషల్ ఈ నెల 12, 19, 26, మే 3, 10, 17న (శుక్రవారాల్లో) బెంగళూరులో మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 12.02 గంటలకు బయల్దేరి మరసటిరోజు తెల్లవారుజామున 2.45 గంటలకు ఖరగ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఖరగ్‌పూర్ – ఎస్ఎంవీ బెంగళూరు (06508) స్పెషల్ ఈ నెల 15, 22, 29, మే 6, 13, 20న (సోమవారాల్లో) ఖరగ్‌పూర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 2.38 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.40 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 7.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

## క్లుప్తంగా

### మే 7 వరకు నూకాంబిక అమ్మవారి నెల పండగ



తాకాశివీధి నూకాంబిక అమ్మవారి సన్నిధిలో అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

అనకాపల్లి : స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారి నెల పండగ మే 7వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తాకాశి రాజేష్ తెలిపారు. అమ్మవారి మాల ధరించిన భక్తులు అగ్నిగుండంలో నడిచిన తర్వాత నూకాంబిక దర్శనార్థం మాల తీసివేసినట్లు తెలిపారు. ఆది, మంగళ, గురువారాల్లో అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. కమిటీ సభ్యులు తాకాశి కన్నబాబు, తాకాశి చందు, వీధి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### మళ్లీ గెలిచేది వైఎస్సార్‌సీపీయే..



మాట్లాడుతున్న మళ్ల బుల్లిబాబు

కశింకోట: రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా.. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కశింకోట, వెదురుపర్తి గ్రామాల పార్టీ శ్రేణులు, మాజీ గ్రామ వలంటీర్లు, బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు కష్టపడితే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, మరో ఐదేళ్ల పాటు ప్రజలకు సేవ చేసే అవకాశం కలుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో చేపట్టిన కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పార్టీ విజయానికి దోహదపడతాయన్నారు. వీటిని ప్రజలకు వివరించి పార్టీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌ల విజయానికి దోహదపడాలన్నారు. కశింకోట, వెదురుపర్తి గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వారీగా సమావేశాలు, నామినేషన్ల ప్రక్రియ అనంతరం గడప గడపకు ఎన్నికల ప్రచారాలు చేపడతామని తెలిపారు. వీటికి అంతా సన్నద్ధం కావాలన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 2,969 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 3,860 | 4,400 |
| మొదటి రకం | 3,590 | 4,360 |
| రెండో రకం | 3,480 | 3,850 |
| మూడోరకం | 3,220 | 3480 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| లవ్‌గురు : | రాజా |
| గాడ్జిల్లా వర్సెస్ కింగ్ కాంగ్ (తెలుగు 3డి) | : సత్యనారాయణస్క్రీన్-1 |
| ఐమాక్స్ | : సత్యనారాయణస్క్రీన్-2 |
| గీతాంజలి | :షిర్డిసాయి |
| ఫ్యామిలీ స్టార్ | : పర్తిసాయి |
| మంజుమ్మెల్ బాయ్స్: | వెంకటేశ్వర |
| ప్రేమలు | : శ్రీసత్య |
| డీజే టిల్లు-2 | :రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 47 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగెటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు,, బీ నెగెటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు, ఓ నెగెటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్, ఏబీ నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 352 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 295 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



## ఊరు మారింది

- సిమెంట్ రోడ్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు
- ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి
- ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

### రహదారి నిర్మాణంతో తప్పిన బాధలు..



ఏనుగుతుని గ్రామంలో కాలనీకి చెందిన నిమ్మదల నారాయణమూర్తి వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. దాదాపు దశాబ్దంన్నర క్రితం కాలనీలో ఇల్లు నిర్మించుకున్నారు. అయితే సరైన రోడ్డు లేక ఇబ్బంది పడేవారు. పెద్ద వర్షం పడితే కాలనీ నీటి ముంపునకు గురయి నీరు తగ్గే వరకు రాకపోకలు సాగించడానికి వీల్లేక అవస్థలు పడేవారు. నాలుగేళ్ల క్రితం సిమెంట్ రోడ్డు నిర్మించడంతో రహదారి సౌకర్యం మెరుగుపడిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### మంచినీటి కోసం నిరీక్షించే కష్టం లేదు..



ఏనుగుతుని గ్రామానికి చెందిన సేనాపతి లక్ష్మిది వ్యవసాయ కుటుంబం. గతంలో సరైన మంచినీరు లేక తీవ్ర ఇబ్బంది పడేవారు. ఇప్పుడు కొత్తగా పైపులైన్, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుతో పుష్కలంగా మంచినీరు అందుతోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి కోసం కుళాయిల దగ్గర నిరీక్షించే బాధ తప్పినందుకు ఎంతో ఆనందంగా ఉందని లక్ష్మి పేర్కొన్నారు.

# ఏనుగుతుని.. అభివృద్ధి గని



ఏనుగుతుని కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

**జరిగిన అభివృద్ధి.. ఖర్చు చేసిన నిధుల వివరాలు**

- రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం
- రూ.29 లక్షలతో మంచినీటి పైపులైన్ నిర్మాణం
- రూ.8 లక్షలతో శ్మశానానికి ప్రహరీ నిర్మాణం
- రూ.26 లక్షలతో నాడు-నేడులో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి
- రూ.11 లక్షలతో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా 450 కుళాయి కనెక్షన్ల మంజూరు

కశింకోట : మండలంలోని ఏనుగు తుని పంచాయతీలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగింది. సుమారు రూ. కోటి రూపాయలు ఇక్కడ అభివృద్ధికి కేటాయించారు. రోడ్లు, స్కూలు, శ్మశానం వంటివి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మంచినీటి సరఫరా మెరుగుపరిచారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలానికి చివర ఒక మూలన ఏనుగుతుని గ్రామం ఉంది. 2 వేలకు పైగా జనాభా కలిగి ఉంది. ఈ ప్రాంతం నూతలగుంటపాలెం సచివాలయం పరిధిలోకి వస్తుంది. రూ.10 లక్షలు వెచ్చించి గ్రామాన్ని ఆనుకుని ఉన్న కాలనీకి నాలుగేళ్ల క్రితం సిమెంట్ రోడ్డు నిర్మించారు. దశాబ్దంన్నర క్రితం ఏర్పడిన కాలనీకి చాలా కాలంగా సరైన రోడ్డు లేదు. పెద్ద వర్షం వచ్చిందంటే కాలనీ నీట మునిగిపోయేది. దీంతో ప్రజలు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల క్రితం సిమెంట్ రోడ్డు నిర్మించారు. అలాగే తాగునీరు లేకపోవడంతో సుమారు కిలో మీటరున్నర దూరంలో ఉన్న శివారు చిన ఏనుగుతుని వద్ద రూ.29 లక్షలు ఖర్చు చేసి బోరు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పైపులైన్ ద్వారా గ్రామంలోని రక్షిత మంచినీటి పథకానికి అనుసంధానం చేశారు. గతంలో ప్రారంభానికి నోచుకోని 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. దాని నుంచి రూ.11 లక్షలతో జల్‌జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయిలు ఇచ్చారు. సుమారు 450 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చి ఇటీవల నీటి సరఫరాను ప్రారంభించారు. ఇంటి వద్దకు నీరు వస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాడు-నేడులో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలను రూ.26 లక్షలతో అభివృద్ధి చేశారు. తరగతి గదులను అందంగా రూపొందించారు. ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేసి రెండు వైపులా అందంగా మొక్కలు నాటారు. రూ.8 లక్షలతో శ్మశానం చుట్టూ ప్రహరీ నిర్మించి అభివృద్ధి చేశారు. ఏనుగుతుని, చిన ఏనుగుతుని గ్రామాల్లో చెరో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. దక్కన్ సిమెంట్ పరిశ్రమ సీఆర్ఎఫ్ నిధుల కింద సమకూర్చిన రూ.14 లక్షలతో అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనం పనులు నిర్వహిస్తున్నారు. ఇలా పలు అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



శ్మశానం అభివృద్ధిలో భాగంగా ప్రహరీ నిర్మాణం





పాఠశాలలో మొక్కల పెంపకం, (ఇన్‌సెట్) నాడు-నేడులో ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి

### శ్మశానం అభివృద్ధి చేశారు..



మా గ్రామంలో శ్మశానం అధ్వానంగా ఉండేది. వర్షం వస్తే బురదమయం అయి ఇబ్బంది పడేవారం. ఇప్పుడు శ్మశానం చుట్టూ ప్రహరీ నిర్మించి అందంగా అభివృద్ధి చేశారు. ఇబ్బంది తొలగి ఆనందంగా ఉంది.

– పూరపు వెంకునాయుడు, ప్రైవేటు ఉద్యోగి, ఏనుగుతుని.

### నూకాంబికకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి హారతి ఇస్తున్న ఆలయ ధర్మకర్త వేగి శివగణేష్

కశింకోట: కశింకోటలో నూకాంబిక అమ్మవారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కొత్త అమావాస్యకు, గంధం అమావాస్యకు మధ్య నెలరోజుల్లో వచ్చే ఆది, మంగళ, గురు వారాల్లో.. వారపు పొద్దు రోజుల్లో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. దీనిలో భాగంగా భక్తులు అమ్మవారికి తల నీలాలు, చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. కుంకుమార్చన చేసి, హారతి ఇచ్చారు. కొందరు ఆలయం ప్రాంగణంలో కుటుంబ సమేతంగా వచ్చి గంప జాతరలు జరుపుకొన్నారు. ఆనందంగా గడిపి ఇళ్లకు వెళ్లారు.

### సీతారాముల కల్యాణ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న చూచుకొండ రమణ

అనకాపల్లి: శ్రీరామ నవమి సందర్భంగా ఈ నెల 17న సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించనున్నట్లు సీతారామ మహిళా సేవా సంఘం వ్యవస్థాపకుడు చూచుకొండ రమణ తెలిపారు. కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎస్ఆర్ పేట రామాలయంలో గురువారం ఆయన విష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వారి కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, అరిగా అప్పారావు, చేబ్రోలు సత్య, దుర్గాప్రసాద్, గొల్లవిల్లి రాము, బల్లిన నాగు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్



శారదా నది ఒడ్డున మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు





ఆలింగనం చేసుకుంటున్న ముస్లింలు

- ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

అనకాపల్లి: పవిత్ర రంజాన్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో రంజాన్ వేడుకలు నిర్వహించారు. స్థానిక శారదానది ఒడ్డున ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మదీనా మసీదు, అనకాపల్లి జామియా మసీదు ఆధ్వర్యంలో నమాజ్ చేశారు. జామియా మసీదు అధ్యక్షుడు పీఎస్ఎన్ హుస్సేన్ మాట్లాడుతూ రంజాన్ మాసం 30 రోజులు పూర్తయిన సందర్భంగా ఉపవాసం ఆచరించి, నమాజ్ చేశామన్నారు. సుమారు 3వేల మంది నమాజ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు మసీదు అధ్యక్షుడు దావూద్ ఆలీ, సభ్యులు జిలాని, సలీం, ఉమర్, బడాబాబు, రజా, భాష, మదీనా మజీద్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని ముస్లింలు రంజాన్ పండగను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. కశింకోటలోని నూకాంబిక అమ్మ వారి ఆలయ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు సంప్రదాయ వస్త్రాలు ధరించి సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇమాం బోధనలు చేశారు. ప్రార్థనలకు వచ్చిన ముస్లింల నుంచి సంప్రదాయంగా జోలె పట్టి విరాళాలు సేకరించారు. చివరిగా ప్రార్థనలు నిర్వహించి ముస్లిం పెద్దలు, పిల్లలు ఆత్మీయంగా రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. హిందువులు కూడా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడి జామియా మసీదు, మండలంలోని చింతలపాలెం మసీదులోను ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.



జోలె పట్టి విరాళాల సేకరణ..



చిన్నారుల ఆత్మీయ ఆలింగనం



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లిం పెద్దలు

## సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- వైఎస్సార్‌సీపీకే మళ్లీ పట్టం కట్టండి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్
- 80వ వార్డులో ఫ్యాన్ గుర్తుకు జైకొట్టిన జనం



బవులవాడలో ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్

అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి తమ పార్టీకి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ కోరారు. 80వ వార్డు గవరపాలెం చిన్నరామస్వామి ఆలయం, వేలం వీధిలో కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిన్నరామస్వామి ఆలయంలో భరత్‌కుమార్, కార్పొరేటర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నడిచేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. మహిళలు హారతులతో స్వాగతం పలికి దీవించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ భరత్‌కుమార్ కరపత్రాలను అందజేశారు. ప్రచారంలో అవ్వాతాతలను పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని తనను దీవించాలని కోరారు.

**అనకాపల్లిని అభివృద్ధి చేస్తా..**

ఈ సందర్భంగా మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ విద్యావంతుడైన తనను దీవించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అనకాపల్లిని అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ.. ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల లబ్ధిని అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 76 ఏళ్ల తర్వాత మన రాష్ట్రంలో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ ఫలాలను నేరుగా అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఫ్యాన్ గుర్తుకే మా ఓటు అంటూ స్థానిక ప్రజలు జైకొట్టారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ ప్రసాద్, వివిధ దేవాలయాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, కె.ఎం.నాయుడు, పార్టీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు విల్లూరి శివసూరి, బుద్ద నర్సింహరాజు, డి.నర్సింగరావు, ఎల్లపు చంద్రమోహన్, కొణతాల కృష్ణంరాజు, పెంటకోట అప్పలనాయుడు, మద్దాల శివనాయుడు, కాండ్రేగుల యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి**

అనకాపల్లి: మండలంలోని బవులవాడలో గ్రామ సర్పంచ్ మజ్జి లక్ష్మీవెంకట అప్పారావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి గడప గడపకు ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నెరవేరిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్, గ్రామ నాయకులు దాడి కుమార్, బొద్దపు ప్రసాద్, ముమ్మిన శ్రీనివాసరావు, ముత్యాల కన్నారావు, ఉప్పులూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



80వ వార్డులో మలసాల భరత్‌కుమార్‌కు హారతిస్తున్న మహిళ

## వెలవెలబోయిన వారపు సంత

కశింకోట: మండల ప్రజలు గురువారం వేసవి తాపంతో సతమతమయ్యారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో అత్యవసర పనులున్న వారు తప్ప అత్యధిక శాతం మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో ఇక్కడి ప్రధాన రహదారులు, వీధులు జన సంచారం లేక బోసిపోయాయి. కశింకోటలో వారపు సంత కొనుగోలుదారులు లేక వెలవెలబోయింది. వ్యాపారులు ఎండకు తాళలేక దుకాణాలు విడిచి నీడ పట్టుకు చేరారు. దీంతో సంత జరిగే ప్రాంతం బోసిపోయింది. ఎండ తీవ్రత తగ్గడంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత యథావిధిగా సంత సాగి కళకళలాడింది. స్థానికులతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి తమకు కావలసిన కూరగాయలు, ఆకుకూరలు, మసాలా దినుసులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసి తీసుకెళ్లారు.



వేసవి ఎండలకు బోసిపోయిన కశింకోట వారపు సంత

**స్థిరంగా కూరగాయల ధరలు**

కశింకోట వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లిపాయలు రూ.25, టమాటా, బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, దొండకాయ, బెండకాయ, వంకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, బీరకాయ రూ.60, చిక్కుడు రూ.80ల చొప్పున విక్రయాలు సాగాయి.

## సారా, మద్యం విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు

దేవరాపల్లి: సారా తయారీ చేసినా, విక్రయించినా ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని చోడవరం ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బిహెచ్. కిరణ్ మణేశ్వరి హెచ్చరిక జారీ చేశారు. రైవాడ పంచాయతీ శివారు బేతపూడి పరిసరాల్లో సారా తయారీ, అక్రమ మద్యం విక్రయాలపై గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎవరూ పట్టుబడలేదు. సారా, మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలు విక్రయించిన వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఇప్పటికే ప్రత్యేక నిఘా ఉంచామని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సారా తయారీ, మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలు విక్రయం లేదా రవాణాకు పాల్పడితే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కె.కోటపాడు సీఐ బి.సిహెచ్. స్వామినాయుడు, దేవరాపల్లి ఎస్ఐ డి. నాగేంద్ర, కె.కోటపాడు, చీడికాడ, ఎ. కోడూరు ఎస్ఐలు, అనకాపల్లి ఎస్ఈబీ ఎస్ఐ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజోద్ధారకుడు జ్యోతిరావు పూలే

అనకాపల్లి : పలు ప్రాంతాల్లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి గురువారం జరిగింది. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ రహదారిలో మహాత్మ జ్యోతిరావుపూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో పూలే చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని కొనియాడారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక విప్లవకారుడిగా అవతరించి బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసినట్లు చెప్పారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ మహేంద్రనాథ్ పట్నాయక్ మాట్లాడుతూ పూలే భారతదేశంలో మహోన్నత సంఘ సంస్కర్త అని, పూలే దంపతులు సమాజం కోసం తమ జీవితాన్ని త్యాగం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వార్డెన్ సుహాసిని, అధ్యాపకురాలు మోతీబాయి, వ్యాయామ ఉపాధ్యాయుడు మదన్‌మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

**నెహ్రూచౌక్‌లో...**

స్థానిక నెహ్రూచౌక్‌లో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక అసమానతలు, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన మహా యోధుడు పూలే అన్నారు. ఆయన నేటి తరానికి ఆదర్శమన్నారు. స్త్రీలకు విద్య కీలకంగా భావించి, తన భార్యకి విద్య నేర్పారని తెలిపారు. పాఠశాల ఏర్పాటు చేసి బలహీన వర్గాలకు విద్య నేర్పిన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కోరుబిల్లి శంకరరావు, నరాలశెట్టి సత్యనారాయణ, పోతురాజు, వీరు యాదవ్, సత్తిబాబు, సూరిబాబు, రమణ తదితరాలు పాల్గొన్నారు.

**సోమవరం గ్రామంలో..**

కశింకోట: మండలంలోని సోమవరం గ్రామంలో గురువారం మహాత్మా జ్యోతీరావ్ పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గురుకుల పాఠశాల ఆవరణలో పూలేకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



నెహ్రూచౌక్‌లో పూలేకు నివాళులర్పిస్తున్న రాజాన దొరబాబు తదితరులు